www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 నవంబర్ 2024
5
తిరుపతి





సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

26న జిల్లా కేంద్రాల ముట్టడి : దడాల సుబ్బారావు

జయప్రదం చేయాలంటూ వెంకటగిరిలో బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, వెంకటగిరి

మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దడాల సుబ్బారావు మాట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయ, కార్మిక రంగం కుదేలైందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతన జీవులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని దినాలు 200కు పెంచాలన్నారు. దినసరి కూలీ రూ.600 ఇవ్వాలని సూచించారు. మోదీ పాలనలో మహిళలు, దళితులు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని వాపోయారు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో ఈ తరహా దాడులు పెచ్చుమీరుతున్నా కూటమి సర్కారు నిద్ర నటిస్తోందని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే సంయుక్త కిసాన్ మోర్చా ధర్నాలో వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, కార్యదర్శి హేమలత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, గంధం మణి, గురవమ్మ, బాలకష్ణ, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

- పుత్తూరులో సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మునిశంకర్, విజయకుమారి, లక్ష్మి, లలిత, అంబిక, పద్మజ పాల్గొన్నారు.
- వెంకటగిరిలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపును జయప్రదం చేయాలంటూ రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సునీత విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్‌చేశారు. తక్షణమే సోమశిల –స్వర్ణముఖి లింకు కాలువను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, వ్యకాసం జిల్లా కార్యదర్శి పి.బాలకృష్ణయ్య, రైతుకూలి సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు వివిరమణయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో బైక్ ర్యాలీ

గం ఎం జాయ్

వర్సిటీలలో విచ్చలవిడిగా అమ్మకాలు

ఆధ్యాత్మిక క్షేత్రంలో విద్యార్థులే టార్గెట్

నిన్నగాక మొన్న తిరుపతి మార్కెట్ పరిసరాల్లో గంజాయి క్రయ విక్రయాలు జరుపుతున్న 'ప్రజాశక్తి'కి చిక్కిపోయారు. తాజాగా సంస్కృత యూనివర్సిటీకి ఒరిస్సా నుంచి వచ్చిన విద్యార్థి 50 గంజాయి ప్యాకెట్లు తెచ్చాడు. 40 ప్యాకెట్లు అమ్మేశాడు. పది ప్యాకెట్లు వృక్షిగతంగా భద్రపరుచుకున్నాడు. ఎలాగో పట్టుబడిపోయాడు. ఒరిస్సా, బీహార్ రాష్ట్రాల నుంచి కొంతమంది విద్యార్థులు, వ్యాపారులు యథేచ్ఛగా తెచ్చి అమ్ముతున్నట్లు సమాచారం. చిన్న ప్యాకెట్ ఒక్కొక్కటి రోజులకు సరిపోయేది రూ.500 ధర పలుకుతోందని తెలుస్తోంది. మోహన్‌బాబు ఇంజనీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ వారు వాకింగ్ పేరుతో వచ్చి ఎస్వీయూ కేంద్రంగా విక్రయాలు చేస్తుంటారని విశ్వసనీయ సమాచారం. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గతంలో గంజాయి సేవిస్తూ హాస్టల్ గదిలో ఓ విద్యార్థి పట్టుబడ్డారు. మహిళా యూనివర్శిటీ లా స్టూడెంట్‌ను గంజాయి పేరుతో ట్రాప్‌లోకి దింపిన ఘటన కూడా ఉంది. ఉన్నత విలువలతో, శాస్త్రీయ విద్యతో సమాజానికి దిక్సూచిగా ఉండాల్సిన యూనివర్సిటీలు మత్తులో గమ్మత్తువుతుండటం సిగ్గుచేటే అంటం.

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుమల తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం.. అంతేకాదు తిరుపతి విద్యా హబ్‌గా విరాజిల్లుతోంది.. శ్రీవారి పాదాల చెంత ఏడు యూనివర్సిటీలు ఉన్నాయి. ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి.. అయితే ఈ ఉన్నత విద్యాసంస్థల్లో 'గంజాయి' ఎంజాయ్ చేస్తోంది. విద్యార్థులే వీరి టార్గెట్.. గంజాయి, డ్రగ్స్, కొకైన్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలు మేధావులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఎక్కడో ఆఫ్రికా దేశాలలో గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్ముతున్నారని గతంలో న్యూస్ ఛానల్లో, వార్తా పత్రికలో చదువుతూ వింటూ ఉండేవాళ్లం. ఉత్తర భారతదేశంలో అభివృద్ధి చెందిన కలకత్తా, ఢిల్లీ, బాంబే వంటి మహానగరాలలో ఈ డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు అమ్మకం జరుగుతుండేది. అయితే ఎంతో పవిత్రమైన తిరుమల తిరుపతి పట్టణంలో ముఖ్యంగా యువత, విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల టార్గెట్ గా మత్తు పదార్థాలు, గంజాయి, స్మగ్లింగ్ అమ్మకాలు కొనసాగుతుండడం బాధాకరం. తాజాగా సంస్కృత యూనివర్సిటీలో పట్టుబడటం ఆందోళన కలిగించే అంశం.

తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రమైన శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల, మోహన్ బాబు విశ్వవిద్యాలయం, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రముఖ మెడికల్, నర్సింగ్ కళాశాలలు, న్యాయ కళాశాలలు నెలకొని ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థుల టార్గెట్ గా గంజాయి, డ్రగ్స్, కొకైన్ వంటి మత్తు పదార్థాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇందుకు నిదర్శనమే రెండు రోజుల క్రితం జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఒక విద్యార్థి చెంత గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి.

రాష్ట్రంలో గత రెండు మూడేళ్లుగా గంజాయి అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా అదుపులోకి వచ్చిన పరిస్థితి లేదనే చెప్పాలి. అధికారులు అవగాహన కల్పిస్తున్నా గంజాయి సమస్య రోజురోజుకూ ఎక్కువవుతుందని తప్ప 'చెక్' పడే పరిస్థితి లేదు. ముఖ్యంగా పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో విద్యార్థులపై యాజమాన్యాలు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఉన్నతాధికారులు ఎటువంటి పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు నిదర్శనమని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, న్యాయ కళాశాలల్లో విద్యార్థుల టార్గెట్‌గా మత్తు పదార్థాల అమ్మకాలు తిరుపతి మహానగరంలో జోరుగా కొనసాగుతున్నాయి. గతంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గంజాయి సేవించి ఒక న్యాయ విద్యార్థినిపై అత్యాచారం చేసి, వీడియోలు రికార్డు చేసి వికృత చేష్టలతో బ్లాక్‌మెయిల్ చేయడంతో, సదరు విద్యార్థిని పోలీసులను ఆశ్రయించింది. ఇటువంటి పలు సంఘటనలు మహిళా వర్సిటీలోనే కాకుండా పద్మావతి డిగ్రీ కళాశాల, మోహన్ బాబు కళాశాల, వెటర్నరీ కళాశాల, వెటర్నరీ వర్సిటీ, ఎస్వీయూ, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో లెక్కకు మించి జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ డ్రగ్స్ అమ్మకాలు విద్యార్థుల యొక్క వసతి గృహాలలో యథేచ్ఛగా జరుగుతుండడన్నది సమాచారం. విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు, తిరుపతి పోలీసు ఉన్నతాధికారుల సహకారంతో పూర్తి స్థాయిలో విద్యార్థులకు గుర్తింపు కార్డులను జారీ చేసి, భద్రత కల్పించడంతోపాటు, వర్సిటీల్లోకి ఎవరైనా బయట వ్యక్తులు వస్తున్నారు అనే వాటిపై నిఘా ఉంచాల్సి ఉంది. ఏదిఏమైనా గంజాయికి తిరుపతిలో చెక్ పెట్టని పక్షంలో ఆధ్యాత్మిక క్షేత్రం 'మత్తు'లో మునిగిపోయే ప్రమాదం లేకపోలేదు.

మహిళలకు భద్రతేది : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారులు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత విద్యార్థి సమాఖ్య నేతలు ఆరోపించారు. వైజాగ్ లో న్యాయ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం ఎస్వీయూలోని విద్యార్థిని వసతి గృహాలలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ పరిశోధకులు ఎన్. మాధవ కష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కో కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు రక్షణ కొరవడిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం, ఇసుక అమ్మకాలపై ఉన్నటువంటి శ్రద్ధ మహిళల భద్రతపై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అమ్మాయిల అక్రమ రవాణా, అత్యాచారాలు ఎక్కువగా జరిగాయని కూటమి ప్రభుత్వం నేతలు ఆరోపించారని, అయితే ప్రస్తుత ప్రభుత్వంలోనూ తీవ్రస్థాయిలో వికత చేష్టలు పెరిగిపోతుండటం, వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివారించలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. వైజాగ్ లో న్యాయ కళాశాల విద్యార్థి పై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, సుష్మిత, నరేంద్ర, వీరేష్, హరిత, మధు, భాను, తిరుమలేష్, రాజు, నర్సన్న పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో విద్యార్థుల నిరసన

రెండేళ్లుగా జీతం ఇస్తే ఒట్టు

అధికారుల చుట్టూ ఎఫ్ఎన్ఓ ప్రదక్షిణలు

స్పందించని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆమె ఓ ప్రాథమిక వైద్యకేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఎఫ్ఎన్ఓ. ఉద్యోగం వచ్చినా వెతలు తప్పలేదు. రెండేళ్లుగా పైసా వేతనం ఇచ్చుంటే ఒట్టు. సాంకేతిక అంశమే కారణం అంటూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక సార్లు కలెక్టర్, డిఎంహెచ్‌వో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. పసిపిల్లలను పోషించుకోవడం కష్టంగా మారడంతో తనను ఆదుకోవాలని అధికారులను వేడుకొంటున్నారు. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గానికి చెందిన కె.సునీత 2022, నవంబరు 29న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎఫ్ఎన్‌వోగా ఎంపికైంది. సత్యవేడులోని బుగ్గ అగ్రహారంలో 2022 డిసెంబరు 2వ తేది విధుల్లో చేరింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. పెద్ద కుమార్తె భర్త హైదరాబాదులో చిరుద్యోగి కావడంతో పెద్ద కుమార్తెను, ఆమె నలుగురు పిల్లలను తన వద్దే ఉంచుకుంది. నెలకో, రెండునెలలకోక్కసారి అల్లుడు పిల్లల వద్దకు వచ్చిపోతుంటాడు. చిన్న కుమార్తెకు ఇటీవలే కాన్పుకావడంతో ఆమె కూడా సునీత వద్దే ఉంటోంది. కుమారుడు డిగ్రీ చదువుకుంటున్నాడు. భర్త సమీపంలోని శ్రీసిటిలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. మొత్తం 12 మంది కుటుంబ సభ్యులను పోషించుకుంటూ ఎలాగోలా కాపురాన్ని లాక్కొస్తుంది. ఈ నేపథ్యంలో ఆమెకు ఎఫ్ఎన్‌వోగా అవకాశం రావడంతో కాస్త ఆనందపడింది. ఇంకేమిలే తమ కష్టాలు కొంత మేరకన్నా గట్టెక్కుతాయని భావించింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆమె కుటుంబం పస్తులతో బతుకు సాగిస్తోంది. తొమ్మిది నెలల పాటు బుగ్గ అగ్రహారంలో విధులు నిర్వహించిన ఆమె అదే మండలంలోని చిన్నపాండురుకు సెప్టెంబర్ 8న బదిలీ అయ్యింది. ఇదే సమయంలో ఆమె పేరుతో బుగ్గ అగ్రహారం నుంచి చిన్నపాండూరుకు పిహెచ్‌సికి బదిలీ చేయాల్సి ఉండగా పొరబాటున మరో కేంద్రానికి పేరును మార్పు చేశారు. తాను ఎన్ని కష్టాల్లో ఉన్నా భరించి ప్రతి రోజూ విధులకు హాజరయ్యేది. అయినా వేతనం ఇచ్చేవారు కాదు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌ను అడిగితే తనకు ఇంకా బిల్లులు రాలేదని, జిల్లా కేంద్రంలో అడగాలని ఉచిత సలహా ఇచ్చారు. జిల్లా వైద్యాధికారిని అడిగితే, అప్కాన్ (ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కాంట్రాక్టు సంస్థ) ప్రతినిధులను అడగాలని చెప్పారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు కలెక్టరు, డిఎంహెచ్‌వో, మెడికల్ ఆఫీసర్లు, ఆఫ్కాన్ అధికారుల చుట్టూ కాలరిగేలా తిరుగుతూనే ఉంది. కానీ ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. సిఐటియు అండతో డిఎంహెచ్‌వోను గట్టిగా ప్రశ్నించడంతో ఆమె పేరు పొరబాటున తిరుపతి రూరల్లో దామినేడు పిహెచ్‌సిలో ఉన్నట్లు తెలియజేశారు. ఇది సాంకేతిక సమస్య అని, దీన్ని రాష్ట్ర కేంద్రంలో సరి చేయాలని సమాధానం చెప్పారు. అప్కాన్ ప్రతినిధులను అడిగితే తమకు సంబంధం లేదని, జిల్లా కేంద్రంలోనే మాట్లాడాలని చేతులు దులుపుకున్నారు. ఇలా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ జారుకుంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం. కుటుంబాన్ని పోషించడమే కష్టంగా తరుణంలో పసిపిల్లలకు ఖర్చులు తడిచి మోపడువుతున్నాయి. ప్రతి వారం సత్యవేడు నుంచి తిరుపతి జిల్లా కేంద్రానికి బస్సు చార్జీలు పెట్టుకుని తిరగలేక ఆమె అవస్థలు పడుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగం ఊడినట్టు అధికార్లు చావుకబురు చల్లగా చెప్పారు. తిరుపతి దామినేడు పిహెచ్‌సిలో కె.సునీత విధులు నిర్వాహిచాలని లిస్ట్‌లో ఉండడంతో 13 నెలలుగా వేచి చూసిన స్తానిక మెడికల్ ఆఫీసర్ ఆమె రావడం లేదని పేరును బ్లాక్ లిస్టులో పెట్టింది. దీంతో ఉన్న ఉద్యోగం కాస్త ఊడిపోయే పరిస్తితి దాపురించింది. రెండేళ్లుగా చిన్నపాండురులో తాను విధులు నిర్వహిస్తుంటే జీతాలు ఇవ్వకపోగా, ఎవ్వరో అధికారులు, ఆఫీస్ సిబ్బంది చేసిన తప్పుకు తన ఉద్యోగాన్ని పోగొట్టుకోవాల్సి వస్తుందని బాధితురాలు లబోదిబో మంటోంది. జిల్లా పాలనాధికారి, డిఎంహెచ్‌వో, ఇతర ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి నిరుపేదరాలైన సునీత సమస్యను పరిష్కరించి, ఆమెకు వేతనాలు ఇప్పించాలని, ఉద్యోగాన్ని కొనసాగించాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

అధికారులు న్యాయం చేయాలి : కె.సునీత, ఎఫ్ఎన్ఓ, చిన్నపాండూరు, సత్యవేడు



రెండు సంవత్సరాలుగా జీతాలు లేకుండానే డ్యూటీ చేస్తున్నాను. తనకు ఏ మాత్రం సంబంధం లేకుండా ఎవ్వరో చేసిన తప్పుకు తనను బలి చేయడం బావ్యం కాదు. ఉన్నతాధికారులు స్పందించి రెండు సంవత్సరాల జీతం ఇప్పించి, ఉద్యోగ మార్పు సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలి.

అధికారుల తప్పుకు ఆమె బలి : ఆర్.లక్ష్మి, సిఐటియు

ఎఫ్ఎన్‌వో సునీతకు రెండేళ్లుగా వేతనం ఇవ్వకపోవడం సరైనది కాదు. బదిలీ సమయంలో ఒక పిహెచ్‌సిలో నమోదు చేయాల్సిన పేరును మరో పిహెచ్‌సిలో నమోదు చేయడం పూర్తిగా జిల్లా కేంద్రం అధికారులు తప్పిదమే. దానికి ఆమెను బలి చేయడం సరైనది కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బాధితురాలికి న్యాయం చేయాలి.

నేడు సిపిఎం 9వ తిరుపతి నగర మహాసభ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సిపిఎం 9 వ నగర మహాసభ యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని నగర కార్యదర్శి టీ. సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం నుండి యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. నగర మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి ముఖ్య అతిథులుగా హాజరవుతరాని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ప్రజా సమస్యలపై చేపట్టే పోరాటాలపై తీర్మానాలు చేపట్టి భవిష్యత్ ఉద్యమాలకు మహాసభలో రూపకల్పన చేస్తారన్నారు. నగర మహాసభను పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమన్వయంతో సక్సెస్ చేయాలి : టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి, పోలీసు, తిరుచానూరు రెవెన్యూ అధికారులకు టిటిడి ఈవో శ్యామలరావు సూచించారు. తిరుపతిలోని పద్మావతీ గెస్ట్ హౌస్‌లో టిటిడి తిరుపతి జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితర అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. 6వ తేదీన నిర్వహించనున్న పంచమితీర్థం రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, పుష్కరిణిలో తోపులాటలు జరగకుండా, ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టిటిడి ఎఫ్ ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, హెల్త్ ఆఫీసర్ సునీల్ పాల్గొన్నారు.

కళ్లిపూడిలో 'గ్రావెల్ దొంగలు'

అడ్డుకున్న అధికారిణికి బెదిరింపులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఖనిజ వనరుల ఖిల్లాగా విరాజిల్లుతున్న తొట్టంబేడు మండలంలో గ్రావెల్ దొంగలు పడ్డారు. పగలూ రాత్రి అన్న తేడా లేకుండా జేసీబీలతో గ్రావెల్(ఎర్రగుల్ల)ను తవ్వేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి, కళ్లిపూడి, సాంబయ్యపాళెం, తొట్టంబేడు, రౌతుసూరమాల, తంగేళ్లపాళెం పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అపారమైన ఎర్ర గ్రావెల్ నిక్షేపాలున్నాయి. వీటిపై ఏపీఐఐసీ అధికారుల నిఘా ఉన్నా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రుల్లో జేసీబీలతో తవ్వి భారీ టిప్పర్ల సాయంతో సరిహద్దులు దాటించేస్తున్నారు. అలా తవ్వి తీసుకెళ్తున్న ఎర్ర గ్రావెల్‌ను ప్రైవేటు లే–అవుట్లు, పరిశ్రమలు, ప్లాట్ల యజమానులకు విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. ఈ క్రమంలోనే తాటిపర్తి పంచాయతీ పరిధిలోని కళ్లిపూడి తెలుగు గంగ కాలువ, ఉప కాలువ పక్కనే వారం రోజులుగా అక్రమార్కులు రాత్రుల్లో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారని తెలుగు గంగ అధికారులకు ఫిర్యాదు వెళ్ళింది. ఆ మేరకు తెలుగంగ జేఈ అనిత ఈ నెల 22న కళ్లిపూడి వద్దకు వెళ్లి అక్రమార్కులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో, వారు ఆమెపైన కూడా దౌర్జన్యం చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. దీంతో వారిపై తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ వెంబడి తవ్వకాలు చేస్తే భవిష్యత్ లో కాలువకు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని జేఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరడం గమనార్హం. ఇదిలా ఉంటే అక్రమార్కులకు ఓ ఏపీఐఐసీ అధికారి అండ ఉండటంతో వారు నిర్భయంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ దొంగల పనిపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసెంబ్లీలో గళమెత్తిన కూటమి ఎంఎల్‌ఏలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కూటమి ప్రభుత్వం పది రోజుల పాటు నిర్వహించిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల సమస్యలపై గళమెత్తారు. తిరుపతి, పూతలపట్టు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరు నియోజకవర్గాలకు చెందిన ఎంఎల్‌ఏలు ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండేవి. తిరుపతి జిల్లా ఏర్పాటు చేసిన తర్వాత తిరుపతిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలు. ఆరు నెలల క్రితం జరిగిన సాధారణ ఎన్నికల్లో తిరుపతి జిల్లా మొత్తం ఎన్‌డిఏ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఏడు స్థానాలను కైవాసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 11 రోజుల పాటు నిర్వహించారు. బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా జిల్లా అభివృద్ధికి కొంత మేరకు నిధులు కేటాయించారు. శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి 171.17 కోట్లు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 226.38 కోట్లు, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ అభివృద్ధికి 72.33 కోట్లు, శ్రీసిటిలో ట్రిబుల్ ఐ టి నిర్మాణాకి 19.25 కోట్ల రూపాయలు కేటాయించారు. వీటితో పాటు జిల్లాలోని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల అభివృద్ధికి 211 కోట్లు, పిహెచ్‌సిల్లో వెల్‌నెస్ కార్యక్రమాలకు 138.14 కోట్లు, శ్రీసిటిలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు 831 కోట్లు, స్మార్ట్‌సిటి పనులకు 97 కోట్ల రూపాయలు, జిల్లాలో అడవులు పరిరక్షణకు 27.48 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇవి కాకుండా అవసరాన్ని బట్టి కొంత నిధులు విడుదల చేస్తామని జిల్లాకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని జిల్లా ఎంఎల్‌ఏలు వెల్లడించారు.

బడ్జెట్ సమావేశాలు సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పలువురు ఎంఎల్‌ఏలకు అసెంబ్లీలో ప్రసంగించే అవకాశం ఇచ్చారు. అందులోనూ కొత్తగా ఎన్నికైనవారు ఎక్కువ మంది ఉన్నారు. ఈ సందర్భంగా గూడూరు ఎంఎల్‌ఏ పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపారని, దీన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని కోరారు. తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఏ భూ అక్రమాలకు పాల్పడ్డాడని, చెరువులు, వాగులను ఆక్రమించారని, దీని వల్ల తుమ్మలగుంట, అవిలాల చెరువులు కనుమరుగు అయ్యాయన్నారు. పేరూరు చెరువు సైతం అన్యాక్రాంతం అవుతోందన్నారు. తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట గత వైసిపి ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడింది. దీనికి సంబంధించి టిడిఆర్ బాండ్ల జారీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలకుల నిర్లక్ష్యంతో శ్రీకాళహస్తి ప్రభుత్వం ఆసుపత్రి పరిస్థితి అత్యంత దయానీయంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి, ఇక్కడి ఆసుపత్రిలోని ఉచిత డయాలసిస్ కేంద్రంలో సేవలు నిర్లక్ష్యం చేసింది. ఆసుపత్రి అభివృద్ధి పేరిట అప్పటి వైసిపి నేతలు కోట్లలో దుర్వినియోగం చేసి కనీస వసతులు కూడా కల్పించలేదు. ప్రభుత్వాస్పత్రి నుంచి పేదలు మృతదేహాలను తరలించాలన్నా కనీసం రూ.10వేలు ఖర్చయే పరిస్థితిని తీసుకొచ్చారు. నియోజకవర్గంలో ఆరు సంక్షేమ వసతి గృహాలు దుర్భరంగా ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రితో పాటు సంక్షేమ వసతిగృహాలను బాగు చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

నగరి ఎంఎల్‌ఏ గాలి భానుప్రకాస్ మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో కోసలనగరం పారిశ్రామిక రంగానికి ఎంతో అనుకూలం. పదేళ్ల కిందట ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఏపిఐఐసి 2500 ఎకరాలను సేకరించింది. ఇప్పటికీ ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదు. చెన్నయ్ విమానాశ్రయానికి, పోర్టుకు 60 కిలో మీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. చెన్నయ్–బెంగుళూరుకు ఎక్స్‌ప్రెస్ వే కూడా కోసల నగరం మీదుగా వెళుతోంది. ఇంత అనుకూలంగా ఉన్న ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రాష్ట్ర ఆర్థిక ప్రగతితో పాటు ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. వీటిపై స్పందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వినతిని ప్రభుత్వం ఏ మేరకు పరిశీలిస్తుందో వేచి చూద్దాం.

ఎండిన చెట్టు..కూలేందుకు సిద్ధం!

- పక్కనే విద్యుత్ తీగలు, పాఠశాల విద్యార్థులు
- నిత్యం వాహనాల రాకపోకలు..
- పట్టించుకోని అధికారులు
- గుండెల్లో గుబులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఎన్నో ఏళ్ల నాటి చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా వుంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా వున్న రహదారి.. దీనికి తోడు అటు విద్యుత్ తీగలు, ఇటు ప్రభుత్వ పాఠశాల వుండడంతో ఏ నిమిషానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహన చోదకులు, విద్యార్థులు, స్థానికులు క్షణక్షణం భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. అధికారులు ఇదేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని చేకూరి నాగమ నాయుడు, ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని తిరుపతి- రాయలచెరువు రోడ్డు పక్కన మిట్టూరుకు వెళ్లే మలుపు వద్ద రావి చెట్టు ఎండిపోయి ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆ ఎండిన చెట్టు కూలితే ప్రమాదం సంభవించడం ఖాయం. పెను ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. 2002 సంవత్సరంలో పరిశుభ్రత -పచ్చదనంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా పాఠశాల ప్రహరీ గోడ పక్కన మొక్కలు నాటి సంరక్షించారు. చెట్టు పెద్దదయింది..పదిమందికి నీడ నిచ్చింది. కానీ ఆ చెట్టు ఎండిపోయింది. ఈ చెట్టు పక్కనే పాఠశాలలో విద్యార్థులు వుంటున్న పాఠశాల భవనం, చెట్టుకు ఆనుకుని 33/11 కేవీ విద్యుత్ లైను వుంది. తిరుపతి- పస్తిపాలెం రోడ్డు మార్గంలో నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. మిట్టూరు గ్రామంలోకి వెళ్లేందుకు ప్రజలు ఆ మలుపు ద్వారానే గ్రామంలోకి వెళ్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ఎండిపోయిన వృక్షం కింద భాగం వేళ్లు కుళ్లిపోయాయి. ఈ వృక్షం పెనుగాలులు వీస్తే విరిగి విద్యుత్ లైన్‌పై పడుతుంది. విద్యుత్ తీగలు తెగి రోడ్డు మీద పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. లేకుంటే పాఠశాల భవనంపై పడితే భవనం కూలిపోయే ప్రమాదం వుంది. ప్రభుత్వ కార్యాలయాలకు కూత వేటు దూరంలో ఈ ఎండిపోయిన చెట్టు దర్శనమిస్తోంది. నిత్యం ఈ రహదారి మీదుగా అధికారులు, వాహనాలలో వచ్చి వెళుతుంటారు. కాని పొరబాటున కూడా ఈ చెట్టు అధికారుల కంట పడటంలేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం రాకముందే కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకర స్థితిలో ఎండిన చెట్టు

క్రైం న్యూస్

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో శనివారం ఓ మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు చెన్నూరు కాపు వీధిలో నివాసం ఉంటున్న సులోచనమ్మ అనే మహిళ పొరుగు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా అదే సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి సులోచనమ్మ మెడలో 3 సవర్ల బంగారు గొలుసును అపహరించుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

- కారు స్వాధీనం- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప జిల్లా ముద్దనూరు వద్ద 30 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ నుంచి ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ అల్లిబాషా బృందం, ఎఫ్బీఓ పి.సుబ్రహ్మణ్యం కలసి జమ్మలమడుగు వైపు తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా, శనివారం ఉదయం ముద్దనూరు మండలం, శెట్టివారి పల్లి ఫారెస్ట్ బీటు పరిధిలోని ఖాళీ వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను కారులో ఎక్కిస్తూ కనిపించారన్నారు. టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయడంతో కొందరు పారిపోయారని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు కడప జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -చంద్రగిరి: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చంద్రగిరి ఎక్సైజ్ సీఐ కెవిఎస్ పనింద్ర తెలిపారు. శనివారం మండలంలోని మామండూరు క్రాస్ (పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి పక్కన) వద్ద ఎం చంగమ నాయుడు మద్యం విక్రయిస్తుండగా అదుపులోనికి తీసుకుని అతని వద్ద 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. చంద్రగిరి సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేకమైన అనధికారిక మద్య దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ దాడులలో ఎస్‌లైలు, ఎం సుధాకర్ రావు, కే గిరి నజీర్, జానకిరామ్ హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర బాబు, కాని స్టేబుల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు శనివారం ప్రశంసాపత్రాలు అందించారు. అయోడిన్ లోపం వల్ల జరిగే అనర్థాలు, ఉపయోగాలపై ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని కలివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన ట్రస్టు సమన్వయకర్తలు సుబ్రహ్మణ్యం, మునిరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆహారంలో అలవాటులో భాగంగా అయోడిన్ వాడకం హెచ్చు తగ్గులు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు రాసిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి -నాయుడుపేట: గ్రామాల్లో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లు తోందని, గ్రామాల పిల్లలు, పెద్దలకు, అనేక రోగాలు వాటిల్లుతు న్నాయని వాటి ని అరికట్టేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో నాలుగు పంచాయతీలకు నాలుగు టాక్టర్లను అందించారు. నాయుడుపేట లోని సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సూళ్లూరుపేట టిడిపి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను సేకరించి గ్రామస్తులను జబ్బుల బారిన పడనీయకుండా చేయడమే కాక సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఆ చెత్త ద్వారా ఎరువులు తయారుచేసి ప్రజలకు ఎన్నో విధాల ఆదాయం చేకూరేలా తీసుకెళ్లాలన్నారు. సూళ్లూరుపేట టిడిపి ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్‌ను రాష్ట్రంలోని ప్రతి గ్రామాలకు అందించేలా చంద్రబాబు నాయుడు అడుగులేస్తున్నారని అందులో భాగంగా నాలుగు పంచాయతీలకు నాలుగు ట్రాక్టరు అందించారు. వీటి ద్వారా చెత్తను స్వీకరించ వచ్చున్నారు.

పంచాయతీ అధికారులకు ట్రాక్టర్లు అందిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

టాస్క్ ఫోర్సు డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు డీఎస్పీగా వి శ్రీనివాసులు రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి తిరుపతి ఎస్‌పి ఎల్ సుబ్బారాయుడును, టాస్క్ ఫోర్స్ ఎస్‌పి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో శ్రీనివాస రెడ్డి సూళ్లూరు పేట డీఎస్పీగా పని చేశా రు. బాధ్యతలు చేపట్టి న ఆయన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

సాయి విద్యానికేతన్‌లో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడి యం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ దయాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు మాత్రమే కాకుండా అన్ని విషయాలపై అవగాహన కల్పిం చేందుకు ఓవరాల్ డెవలప్‌మెంటు ఆఫ్ స్టూడెంట్‌లో భాగంగా ఆ పాఠశాల ఎస్‌పిఎల్ , ఏఎస్‌పిఎల్ ఎన్నికలను నిర్వహించి ఎన్నుకున్నారు. విద్యార్థులకు చదువు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను పెంపొందించి దేశంలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు? ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ ఎన్నికలు నిర్వహిం చామన్నారు. పాఠశాలలో పదవ తరగతి , తొమ్మిదవ తరగతి విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు ఓటింగ్ లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి విద్యార్థి సామాజిక అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, బాలకృష్ణ, సాహితీ, భానుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

బుచ్చినాయుడు కండ్రిగ: ఓటర్లలో అక్షరాస్యతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దారు సుబ్రహ్మణ్యం చెప్పారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జిప్రధానోపాధ్యాయులు ధనుంజయులు అధ్యక్షతన ఓటరు అక్షరాస్యత ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్ కుమార్ నాయుడు, వీఆర్వో బాలమురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కుష్ఠ , డయేరియా, దోమల నివారణ చర్యలు, తదితరాల పై నారాయణవనం ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాగ సుధా వైద్యాధికారి డాక్టర్ దర్శిత రాజ్ ఆధ్వర్యంలో నారాయణవనం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కల్పించారు. కుష్ఠ వ్యాధి లక్షణాలు వివరించి అలాంటివి వుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత వర్షాలకు నీరు కలుషితం అయ్యే ప్రమాదం వుందని అలాంటి కలుషిత నీటిని తాగితే డయేరియా వచ్చే అవకాశం ఉందని నీటిని కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. దోమల నివారణకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సులోచన ప్రిన్సిపాల్, హెల్త్ సూపరువైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఇతర ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ సమీపం లోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో 2004 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యం లో క్రికెట్ పోటీలు నిర్వహించ నున్నారు. క్రీడాకారుల క్రీడా దుస్తులను కళాశాల ప్రిన్సిపల్, పూర్వపు విద్యార్థులు శనివా రం ఆవిష్కరించారు. పూర్వపు విద్యార్థి గాంధీ మాట్లాడుతూ 2004 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీన క్రికెట్ పోటీలు నిర్వహిస్తు న్నామని, పూర్వపు విద్యార్థులు , నేటితరం విద్యార్థులు కలిసి ఆలోచనలు పంచుకునే నేటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు తమ వంతు సహకారం అందిస్తామని రాబోయే రోజుల్లో పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఇంకా అనేక కార్యక్రమాలు నిర్వహి స్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజా, మురుగుదాస్, ధనంజయ, మోహన్, రాజయ్య , పీడీ రవిచంద్ర , భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు ఆవిష్కరిస్తున్న క్రికెట్ నిర్వాహకులు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పచ్చలమ్మ గుడి సమీపంలో కేటి రోడ్డుకు ఇరు వైపులా ట్రాఫిక్ సమస్యను నియంత్రిం చేందుకు శని వారం పోలీసు లు చర్యలు చేపట్టారు. మండ లం లోని పచ్చలమ్మ దేవస్థా నం కేటి రోడ్డు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ దారులు నిర్మించిన రేకుల షెడ్డు, చెక్క దిమ్మెలు, అడ్వర్టైజింగ్ బోర్డులు శ్రీకాళహస్తి డిఎస్‌పి నరసింహమూర్తి ఆదేశాల మేరకు సిఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య రాకుండా వ్యాపారాలు చేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదని, రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదట దేవస్థానం నుండి ప్రారంభించి బుచ్చినాయుడు కండ్రిగ, కెటిఆర్ రోడ్డుకి ఇరువైపులా అక్రమ కట్టడాలు తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ రావు, ఎంఈఓ రవీంద్రనాథ్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫార్మసీ రంగంలోనే మంచి గుర్తింపు'

ముఖ్య అతిథిని సన్మానిస్తున్న ఫార్మసీ కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి రామచంద్రాపురం: ఫార్మసీ విద్యార్థులు కష్టపడి చదివి, నూతన ఔషధాల తయారీపై పరిశోధనలు చేస్తే ఫార్మసీరంగంలో మంచి గుర్తిం పు, అభివృద్ధి, ఉపాధి అవ కాశాలు పొందవచ్చని విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ వి రఘుమూర్తి అన్నారు. వెంకట్రామా పురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మాసిస్టుల 63వ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు ప్రజలకు ఉపయోగపడే ఔషధాలను వెలుగు లోకి తీసుకురా వాలన్నారు. విశిష్ట అతిథి సీనియర్ కన్సల్టెంట్ గురు తిలక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థులు నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే బంగారు భవిష్యత్తును పొందవచ్చు అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు, కళాశాల సిబ్బంది వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు అందించారు. ముఖ్య అతిథి డాక్టర్ విరఘుమూర్తిని దుశ్శాలువ, పుష్ప గుచ్ఛాలతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

విశ్వబ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్ట్‌పై చట్టం హర్షణీయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలలో ఏర్పాటు చేసే ఆలయ కమిటీ నియామకాల్లో విశ్వబ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ చట్టం చేయాలని ప్రతిపాదించడం హర్షణీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భాలయ మూలమూర్తితో సహా ప్రతిష్టాపన యంత్ర సహిత దేవాలయ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించే విశ్వబ్రాహ్మణులను ప్రాతిపదికగా తీసుకొని వారి సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే వంశీకృష్ణ అసెంబ్లీలో నామినేటెడ్ పోస్టులు చట్టం చేయాలని ప్రతిపాదించడం సంతోషకరమన్నారు.

కుటుంబ కథా చిత్రం' దేవకి నందన వాసుదేవ'

- మనవడు హీరో గల్లా అశోక్‌ను ఆదరించండి- మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): 'నా మనవడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు గల్లా అశోక్ హీరోగా నటించిన కుటుంబ కథా చిత్రం 'దేవకి నందన వాసుదేవ' సినిమాని కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ చూడదగిన చిత్రమని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. శనివారం చంద్రగిరిలో ఎస్ వి సినిమాస్ లో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి హీరో గల్లా అశోక్ నటించిన దేవకీ నందన వాసుదేవ సినిమాను వీక్షించారు. ఎస్వీ సినిమాస్ లో సినిమా షో ప్రారంభానికి ముందు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తన మనవడు గల్లా అశోక్ నటించిన చిత్రం విజయవంతం కావాలంటూ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గల్లా అశోక్ చాలా కష్టపడి, డాన్స్ ఫైట్స్ చేశారని, తన మనవడు గల్లా అశోక్ ను ఆదరించాలని కోరారు. అనంతరం స్థానిక టిడిపి నాయకులు మాజీ మంత్రి కల్లా అరుణ కుమారిని దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎజిపల్లి బాల, ముడిపల్లి సురేష్ రెడ్డి, బడి సుధా యాదవ్, ఎస్ గౌస్ బాషా, టిడిపి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు యం సుబ్బయ్య స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం పలికారు. తిరుమల వెంకన్న దర్శనానికి మంత్రి విచ్చేసిన సందర్భంగా సుబ్బయ్య ఆమెకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి ఆవులుమడుగు. కళావతి పాల్గొన్నారు.

బిఓఎస్ ఛైర్‌పర్సన్‌గా గుండ్లపల్లి శిరీష

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంస్కృత శాఖ అధ్యాపకురాలు ఆచార్య గుండ్లవల్లి శిరీష బిఓఎస్ ఛైర్ పర్సన్ గా నియమితులయ్యారు. ఆమె నియామక పత్రం వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. 2007లో ఉప-సహాయ అధ్యాపకురాలుగా సంస్కృత శాఖలో నియమితురాలైన ఆమె, 2019లో సహాయ అధ్యాపకురాలిగా, 2022లో ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందారు. ఆమెకు మొదటిసారిగా బిఓఎస్ ఛైర్‌పర్సన్‌గా నియామకం కావడానికి వర్సిటీలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మంచు విష్ణువర్ధన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మంచు విష్ణువర్ధన్ బాబు జన్మదిన వేడుకలను రాష్ట్ర మంచు యువసేన అధ్యక్షులు ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తి ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని మాతృస్య ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. 150 మంది పిల్లలకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వహణకు అవసరమైన వాషింగ్ మెషీన్, రిన్ సోపులు అందించారు. ఈ కార్యక్రమంలో నాగ, రమేష్, పవన్, లోకేష్, జస్వంత్ పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఎలివేట్ - 2024

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ లో విద్యార్థుల ప్రతిభ పాటవాలను వెలికి తీయడం కోసం ప్రతి ఏటా నిర్వహించే ఎలివేట్ - 2024ను ఘనంగా నిర్వహించినట్లు ఆ కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. శనివారం నిర్వహించిన ఎలివేట్ - 2024 కార్యక్రమంలో కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం బీకాం విద్యార్థి సాధించారన్నారు. వ్యాపార రంగంలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి బిజినెస్ క్విజ్, పికాస్సో, స్పీకప్, స్టాక్ బజ్, బిజినెస్ ప్రపోజల్, జంక్ యాడ్ తదితర విభాగాలలో పోటీలను నిర్వహిం చామన్నారు. ఈ పోటీలలో అచీవర్ ఆఫ్‌ద ఇయర్ అవార్డును తృతీయ సంవత్సరం బీకాం విద్యార్థిని మోహిత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి, కార్యక్రమ కోఆర్డినేటర్ రమేష్, నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఉచిత ఇసుకకూ రసీదులు : ఆర్‌డీవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భూమి రికార్డుల బదలాయింపు (మ్యుటేషన్లు)పై రెవెన్యూ సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి సూచించారు. ఉచిత ఇసుకే అయినా లబ్ధిదారులు తప్పనిసరిగా ఆయా సచివాలయాల్లో రశీదులు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తొట్టంబేడు తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ పాలనపై అధికారులకు తగు సూచనలు చేశారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల పరిధిలోని ఉన్న భూములు విలువైనన్నారు. ఈ భూముల రికార్డుల బదలాయింపులో వాస్తవిక విషయాలు పరిగణలోకి తీసుకుని వెళ్లాలన్నారు. తొట్టంబేడు మండలంలో ఇసుక, ఎర్ర గుల్ల అక్రమంగా తరలిస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయనీ, వీఆర్వోలు, తలారీలు ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని సూచించారు. ఉచిత ఇసుకపై ఆంక్షలు వద్దనీ, కాకుంటే లబ్ధిదారులు ఆయా సచివాలయాల్లో ఉచిత రశీదులు పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహశీల్దారు మధుసూదన్ రావు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..
తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి -కోట : గత ఎన్నో సంవత్సరాల నుండి అనాదీనం భూమిని సాగుచేసుకుని జీవనధారం సాగిస్తున్న కుటుంబాన్ని పోషించుకుంటున్నానని బాధితురాలు ఎస్ కే.జమీలా శనివారం తహసీల్దార్ కే.జే జే రావు ను కోరడం జరిగింది.వివరాల్లోకి వెళ్ళితే కోట మండలం రుద్రవరం గ్రామానికి ఎస్ కేజమిలాకు చిట్టేడులో పట్టాభూమి సర్వే నెంబర్ 297-2 లో 71 సెంట్లు భూమి వుందని, దాని పక్కనే అనాదీనం 41 సెంట్లు భూమిని ఆక్రమిం చుకుని సాగు చేసుకుంటూ ఉందని తెలుపుతూ అనాదీనం భూమిని మరొక వ్యక్తి ఫయాజ్‌కు కౌలుకు ఇచ్చాడని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాన్వాజ్ తెలిపారు. ప్రస్తుతం ఆ అనాదీనం భూమిని కౌలుకు తీసుకున్న వ్యక్తి తమదని బెదిరిస్తున్నారని తహశీల్దారు ఎదుట వాపోయారు. గత ఎన్నో సంవత్సరాలుగా ఆక్రమించుకున్న అనాదీనం భూమిని తమకు ఇప్పించాలని తహశీల్దారు కటారి జయ జయ రావుకు వినతిపత్రం అందించారు. తక్షణమే స్పందించిన తహశీల్దారు కేజేజే రావు విచారించి న్యాయం చేస్తామని బాధితురాలు జమిలా కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాన్వాజ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ డి షిరాజ్,ఇన్సాఫ్ జిల్లా సమితి సభ్యులు ఎస్ కే హుస్సేన్ బాష,యువజన సంఘం నాయకులు ఎస్ కే. షబ్బీర్ ఉన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

పెన్షనర్ కుటుంబానికి అండ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ : ఓ పెన్షనర్ కుటుంబానికి ఉపాధ్యాయ సంఘం అండగా నిలిచిందని బాధితురాలు పేర్కొన్నారు. బియన్ కండ్రిగ మండలం పట్టాభి జిసి పాఠశాలలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పెరిమిడి రవీంద్ర 2024 వ సంవత్సరం ఫిబ్రవరి 21 వ తేదీ మృతి చెందాడు. కాగా ఆమె సతీమణి సుభద్రమ్మకి గత ఎనిమిది నెలల పెన్షన్ అరియర్స్ 3లక్షల84వేల రూపాయలు కోవనూరు శాఖ ఎస్‌బిఐ శ్రీకాళహస్తిలో ప్రభుత్వం ఈ నెల 2వ తేదీ జమ చేసింది. మృతుడు రవీంద్ర బ్యాంకు వారికి లోను బకాయిలు ఉన్నారని, అది చెల్లించే వరకు డబ్బు విత్ డ్రా చేయకుండా బ్యాంకు మేనేజర్ బి రమేష్ కుమార్ హోల్డ్ లో పెట్టారని, ఈ విషయమై ఆ కుటుంబం సభ్యులు , ఎపిటిఎఫ్ నాయకులు బ్యాంకు తిరుపతి జిల్లా శాఖను సంప్రదించగా హుటా హుటిన స్పందించి ఉద్యోగి మృతి చెందిన తర్వాత ఆ ఫ్యామిలీ కి సంబంధించి పెన్షన్ బకాయిని ఆపే అధికారం లేదని సంబంధిత బ్యాంకు మేనేజరుపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఆ కుటుంబానికి చెందిన ఖాతాను హోల్డ్ నుంచి ఉపసంహరించారు. దీంతో ఆ కుటుంబం పెన్షన్ అరియర్స్ మొత్తాన్ని ఖాతా నుండి డ్రా చేసుకోవడంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేసింది. కృషి చేసిన ఉపాధ్యాయ సంఘానికి కృతజ్ఞతలు తెలుపుకుంది.

ఎంబిఏలో 'ఆర్‌సిఆర్' విద్యార్థుల ప్రతిభ

పతకం అందుకుంటున్న కళాశాల టాపర్ బి యశస్విని

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, కరకంబాడి రోడ్డులోని ఆర్‌సిఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంబిఏ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో తమ ప్రతిభ చాటారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆ కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, క్రమ పద్ధతిగా తరగతులకు హాజరై చక్కగా పాఠ్యాంశాలు అవగాహన చేసుకుని, పరీక్షలను చక్కగా రాస్తే ఉన్నతమైన గ్రేడ్ ర్యాంకులు సాధించవచ్చన్నారు. బి యసస్విని 8.21, సి మాధవి 8.20, ఎస్ హర్షవర్ధిని 8.18, పి దివాకర్ 8.08, ఎం మమత 8.06, జిపిఏ గ్రేడ్ మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యధిక జీపీఏ గ్రేడ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ వి రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ ఆర్ శివప్రసాద్ వర్మ మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలను అందించారు. ఉన్నత గ్రేడ్ మార్కులు సాధించిన విద్యార్థులను విభాగాధిపతులు వై నిరీష, పి లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మాధురిని అభినందించారు.

డ్రగ్స్ మహమ్మారిని అరికట్టండి: భాను ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : సంస్కృతం విద్యాపీఠంలో ఇటీవలే గంజాయి కలకలం రేపిన విషయం విదితమే. ఈ క్రమంలో బిజెపి స్పోక్స్ పర్సన్, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి సంస్కృత విద్యాపీఠం విసిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్కృత విద్యాపీఠంలో గంజాయి ఆనవాళ్లు కనిపించడం దారుణమని ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని విసిని కోరారు. సానుకూలంగా స్పందించిన విసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరై సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఆటలు, పాటలు, నాటికలు, నాటకాలతో వినోదాన్ని., సందేశాన్ని పంచారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శవంతంగా నిలవాలని వైస్ ప్రిన్సిపాల్ నరసింహ వర్మ తెలిపారు. అధ్యాపకులు బాపనీస్, గంగారాం, రమేష్, రాజేంద్రుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వినికిడి పరికరాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు పుత్తూరు న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలకు స్థానిక బధిరుల పాఠశాలలో ప్రభుత్వ వైద్యుల ఉచిత వైద్య శిబిరాన్ని పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలని, మేనరికం వివాహాలు వల్ల అంగవైకల్యం పిల్లలు జన్మించే అవకాశం వుందని చిన్నతనంలోనే పిల్లలకు వినికిడిని మాటలను పరిశీలించి ఏదైనా లోపం ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. పుత్తూరు గవర్నమెంట్ హాస్పిటల్ టిఆర్ఎస్ పావని ప్రసంగించారు. బధిరుల పిల్లలకు వినికిడి పరికరా లు న్యాయమూర్తి అందించారు. ఉచిత వైద్య శిబిరంలో పుత్తూరు గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ జయ, మదర్ థెరిసా బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ శివయ్య, ఉపాధ్యాయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె పురుషోత్తం పాల్గొన్నారు.

ఓబీసీలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - క్యాంపస్ : ఓబీసీలు నాయకత్వ లక్షణాలు కలిగి వుండాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపు నిచ్చారు. ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వర రావు ఆధ్వర్యంలో కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జెండాను శనివారం ఎస్వీయూ సెనేట్ హాలులో ఆవిష్కరించారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (Senior Division), TIRUPATI
S.O.P.No. 9 OF 2024
BETWEEN
1. K. Ajay Kumar
2. K. Vinay Kumar ...**Petitioners**
AND
The Employees Provident Fund Organisation, rep. by its Accounts Officer (Pension), Regional Office at D.No.1/30, R.S. Road, Kadapa, Andhra Pradesh-516004 ...**Respondent**
GENERAL NOTICE
It is to inform all the public that the above named Petitioners have filed the above Succession O.P. for the grant of SUCCESSION CERTIFICATE to be declared as the L.Rs of their deceased father, K.Seshagiri. The said Certificate has to be produced for receiving the E.P.F. amount of Rs.77,700/- stands in the name of Late K.Seshagiri, which is in the hands of Respondent. Hence if any objections in any body, you may appear before the above said Hon'ble Court on 06.12.2024 at about 10.30 a.m. and raise your objections if any; failing which, the above SOP will be decided accordingly.
Date of Hearing: 06.12.2024
ALOOR PRATAP., B.A., B.L.
POOLA PRABHAKAR, B.A., B.L.,
Advocates for Petitioners.

IN THE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI
O.S.NO. 1112/2023
C.H. Bharath ...**Plaintiff**
Vs
P.Chandra Sekhar ...**Defendant**
SUMMONS TO DEFENDANT
P.Chandra Sekhar, S/o. P.Munirathnam, D.No.3-4-123, Giddangi Street, Tirupati, Tirupati District.
Please take suit summons that the above suit filed by the plaintiff against you. The Matter posted to 31-12-2024 for your appearance either in person or through your advocate at 10:30am in the above court in the event of your absence the matter will be decided exparte.
Hearing date: 31.12.2024
SIRIPARAPU RAVI, B.Com.,B.L.,
T.GEETHANJALI, B.L.,
H.S.VOOHA, B.L.,
Advocates, Tirupati
Cell: 9866693338

విద్యుత్ తీగలు తగిలి ఏనుగు మృతి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు (తిరుపతి జిల్లా)

విద్యుత్ తీగలు తగిలి ఏనుగు మృతిచెందిన ఘటన చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయితి దేవపట్లవారిపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏనుగుల గుంపు దేవపట్లవారిపల్లి సమీపంలో అరికెలవాండ్లపల్లి రైతు రామకృష్ణారెడ్డి పొలంలోని గుడిసెను, అందులోని టమోటా క్రేట్లు, ఎరువులను ధ్వంసం చేశాయి. నారాయణరెడ్డికి చెందిన అలసంద తోట తిని తొక్కి నాశనం చేశాయి. గరుడారెడ్డికి చెందిన అరటిచెట్లు పీకేశాయి. ఈ నేపథ్యంలో ఓ ఏనుగుకు విద్యుత్ తీగ తగిలి మృతిచెందినట్లు తెలుస్తోంది. అయితే విద్యుత్ తీగలు అమర్చిన ఆనవాళ్లు ఎక్కడా ఘటనా స్థలంలో లేకపోవడం గమనార్హం. అయితే ఏనుగుకు విద్యుత్ తీగ అతుక్కుని ఉండడంతో అనుమానం వ్యక్తమవుతోంది. మామిడి తోట రైతు సుభాషిణి, ఆమె భర్త శివారెడ్డి టిటిడిలో ఉద్యోగం చేస్తుండడంతో తిరుపతిలో కాపురం ఉంటున్నారు. శనివారం ఉదయం మామిడి తోట దున్నేందుకు బాడుగ ట్రాక్టర్ తీసుకుని వెళ్లిన వీరికి ఏనుగు చనిపోయి ఉండటాన్ని చూసి ఖంగుతిన్నారు. భాకరాపేట ఫారెస్టు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏనుగు పడి ఉన్న మామిడి తోట రైతు సుభాషిణి, ఆమె భర్త శివారెడ్డిని, పక్కనున రైతులను విచారించారు. ఏనుగుల సంచారంపై రైతులకు సమాచారం ఇవ్వని ఫారెస్టు శాఖపైన, రాత్రికి రాత్రి విద్యుత్ తీగలను అమర్చి జంతువులను వేటాడుతున్న వేటగాళ్లను పట్టుకోవడంలో నిర్లక్ష్యంపై విద్యుత్ శాఖపైన పలు విమర్శలు ఉన్నాయి. ఏనుగు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎఫ్ఆర్ఓ వెంకటరమణ తెలిపారు. వేటగాళ్లు అమరుస్తున్న విద్యుత్ తీగల వల్లే ఏనుగు మృతిచెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

రబీ సాగుకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జీవనానికి మూలాధారమైన ఆహారం పండించే రైతు సేవ కంటే సష్టిలో మరేదీ గొప్పది కాదని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రెనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. రబీ సాగుకు రైతులను సమాయత్తం చేయుటకు కలెక్టరేట్లో సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సేవలను రైతులకు బాధ్యతతో, గౌరవంగా అందించాలని ఆయన సిబ్బందిని కోరారు. ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్న రసాయనాల వాడకాన్ని వీలైనంతవరకు నియంత్రించాలని ఆయన కోరారు. ఈ పంట నమోదు, పంటల బీమా, పీఎం కిసాన్, చీడల గుర్తింపు, నివారణ యాప్ లపైన జిల్లా వ్యవసాయ కార్యాలయం టెక్నికల్ అధికారులు హరిత, గాయత్రి, శశికళ, వాణి, సరళ వివరించారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ పాండురంగ వరిలో చేపట్టవలసిన చీడల నివారణ గురించి వివరించారు. శ్రీకాళహస్తికి చెందిన రాజేంద్రనాథ్ రెడ్డి సహజ వనరుల సద్వినియోగం, జీవ వైవిధ్య సంరక్షణ, సేంద్రీయ సాగుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విస్తరణ సిబ్బందితోపాటు జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ లక్ష్మీదేవి, ఏఓలు శశిధర్ రెడ్డి, వేణుగోపాలరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్లో 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని వక్తలు డిమాండ్చేశారు. శనివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన రౌండ్టేబుల్ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి టి. సుబ్రమణ్యం మాట్లాడుతూ 2005 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ప్రారంభించిన 108 ఉచిత అంబులెన్స్ సర్వీస్ తర్వాత అంచలంచెలుగా ఎదిగి, ఈరోజు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు, సరిహద్దు దేశాలకు విస్తరించిందంటే దానికి కారణం ఈ సర్వీస్ లో పనిచేస్తున్న ఉద్యోగుల నిబద్ధత ప్రమాణంగా చెప్పవచ్చన్నారు. 24×7 అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ 108 ఉద్యోగులు వారి ప్రాణాలను పణంగా పెట్టి బాధితులను కాపాడిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో చాలా డిపార్టెంట్లు కన్నా మెరుగ్గా సేవలందించారన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి.వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో 108 సర్వీసు నిర్వహణ బాధ్యతలు చేపట్టిన జీవికే ఈఎంఆర్ఐ (2005 - 2017), బివిజి (2017 - 2020) అనే సంస్థలు ఇప్పటికే బాధ్యతల నుండి వైదొలుగుతున్న సమయంలో ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవులకు సంబంధించిన అమౌంట్ చెల్లించాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి సుమారుగా 40 వేల రూపాయల నుండి 50 వేల రూపాయల వరకు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.మహేష్, ప్రధాన కార్యదర్శి ఆర్. మునిరాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. సునీల్ నాయకులు లవకుమార్, ముని, భానుచంద్ర, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రోత్సాహకాలపై ప్రత్యేక దృష్టి : శాప్

ప్రజాశక్తి -రేణిగుంట

ఏపీ క్రీడారంగం అభివృద్ధే సీఎం నారా చంద్రబాబు నాయుడు గారి ప్రధాన అజెండా అని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దడమే ఆయన ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రేణిగుంటలోని జెడ్పీ హైస్కూల్లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-19 జూడో ఛాంపియన్షిప్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక నాయకులు, విద్యాశాఖాధికారులతో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయస్థాయిలో మన క్రీడాకారులు రాణించాలనేది సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ల సంకల్పమన్నారు. ప్రభుత్వాలు మారినా క్రీడాప్రోత్సాహకాలు మారకూడదని, దానివల్ల క్రీడాకారులు వెనకబడిపోతారని దిశానిర్దేశం చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగంలో చేసిన ఘోర తప్పిదాలను సరిచేసుకుంటూ ఏపీ క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు శాప్ కృషి చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గత ఐదేళ్లుగా పెండింగ్లో ఉన్న రూ.12.70 కోట్ల క్రీడాప్రోత్సాహకాలను విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమానికి ముందు శాప్ ఛైర్మన్ను నిర్వాహకులు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ సయ్యద్సాహెబ్, డిఐఈఓ విశ్వనాథ్, డీవైఈఓ బాలాజీ, హెచ్ఎం విష్ణువర్ధన్, ప్రతాప్రెడ్డి, జయరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే యుటిఎఫ్ లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తిరుపతి రూరల్, తిరుపతి అర్బన్, రేణిగుంట మండలాల సంయుక్త స్వర్ణోత్సవ మహాసభలు తిరుపతి పెద్దకాపులే ఔట్ లోని యుటిఎఫ్ తిరుపతి జిల్లా కార్యాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ స్వర్ణోత్సవ మహాసభలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బండి మధుసూదన రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ 1974వ సంవత్సరం ఆగస్టు 10న ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిన యుటిఎఫ్ 50 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేసిందని, కనీస వేతనంతో బతుకుతున్న ఉపాధ్యాయులకు ఈరోజు మెరుగైన వేతనాలతో పాటు, అనేక రకాల వత్తిపరమైన సౌకర్యాలను కలగజేయడంలో యుటిఎఫ్ అతిపెద్ద పాత్ర పోషించిందని తెలిపారు. జనవరి 5-8 తేదీల్లో కాకినాడలో భారీస్థాయిలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, నాయకులు కెఎస్బి సూర్యప్రకాష్, అవనిగడ్డ పద్మజ, దండు రామచంద్రయ్య పాల్గొన్నారు.

యుటిఎఫ్ నగర కమిటీ ఏకగ్రీవం

యుటిఎఫ్ తిరుపతి నగర శాఖ ఏకగ్రీవమయ్యింది. గౌరవాధ్యక్షులుగా కె.వరలక్ష్మి, అధ్యక్షులుగా వై. హేమాద్రిబాబు, సహాధ్యక్షులుగా ఎం.కృష్ణకుమార్, డాక్టర్ ఎం.నిర్మలభాయ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఖాదర్బాషా, కోశాధికారిగా వి.ప్రభుకుమార్, మహిళా కార్యదర్శులుగా పి.కవిత, పి.మారుతీదేవి, ఎం.ప్రసన్నలక్ష్మి, నగర కన్వీనర్గా బండి యామిని, సిపిఎస్ కన్వీనర్లుగా గాటి గుణశేఖర్, వి.సునీత, బి.ప్రభాకర్రావు, ఫ్యామిలీ వెల్ఫేర్ స్కీమ్ కన్వీనర్గా గోపాల్ ఎన్నికయ్యారు.

అసంపూర్తి మురుగు కాల్వలను పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ కాలువలను వెంటనే పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని లీలా మహల్ కూడలి, కరకంబాడి మార్గం, కొర్లగుంట కూడలి, బ్లిస్ కూడలి తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉన్న మురుగునీటి కాలువలను నగరపాలక సంస్థ, స్మార్ట్ సిటీ అధికారులతో కలిసి శనివారం ఉదయం పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.చంద్రశేఖర్ ఉన్నారు.

పుట్టపర్తి సత్య సాయిబాబా జన్మదినం సందర్భంగా పూర్వపు విద్యార్థి సునీల్ కుమార్ 15వేల రూపాయలు విలువ చేసే పుస్తకాలు, పెన్నులు, టెస్ట్ బుక్కులు బేరి వీధి మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఖాదర్బాషాకు అందజేస్తున్న దృశ్యం.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సత్యవేడు వేదికగా డిసెంబర్ 1,2 తేదీలలో జరిగే సిపిఎం తిరుపతి జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో శనివారం సీపీఎం జిల్లా మహా సభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా వందవాసి నాగరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. పాలక ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగట్టేందుకు జిల్లా మహాసభల వేదికగా భవిష్యత్తు పోరాటాల కార్యాచరణను సిద్ధం చేయడం జరుగుతుందని వివరించారు. సీపీఎం నేతలు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్దన్, గంధం మణి, పెనగడం గురవయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

- రేణిగుంట తారకరామనగర్లో ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె.హరినాథ్ ఆధ్వర్యంలో పోస్టర్ను ఆవిష్కరించారు. సత్యశ్రీ, సుజాత, రాజశేఖర్, శివానందం, మునిరాజా పాల్గొన్నారు.
- కెవిబిపురంలో మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు.

అమరరాజాలో ఉద్యోగుల 'వెల్నెస్ రన్'

రేణిగుంట : అమరరాజాలో ఉద్యోగుల వెల్నెస్ రన్ కార్యక్రమం శనివారం జరిగింది. 'నా ఆరోగ్యం.. నా బాధ్యత' నినాదంతో వెయ్యి మందికి పైగా ఉద్యోగులు మూడు కిలోమీటర్లు, ఐదు కిలోమీటర్ల పరుగులో పాల్గొన్నారు. చిన్న వార్మప్ సెషన్తో ఈ కార్యక్రమం జరిగింది. మునీశ్వరనాయుడు, సతీష్కుమార్, కిషోర్ కోన జెండాను ఊపి రన్ను ప్రారంభించారు.

సైబర్ నేరాలపై అవగాహన

తిరుపతి సిటీ : ఎస్వీ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పివి చంద్రశేఖరన్ శనివారం ప్రారంభించారు. అడిషనల్ ఎస్పి లా అండ్ ఆర్డర్ రవి మనోహర్ ఆచారి మాట్లాడుతూ సైబర్ నేరాలపై వైద్య విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన అవసరమన్నారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ ఫోన్ కాల్స్తో కోట్లు కాజేస్తున్నారన్నారు. మహిళ డిఎస్పి శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ సునీత పాల్గొన్నారు.